క్లుప్తంగా

ఇళ్ల స్థలాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(రూరల్): కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలో సొంతిల్లు లేని నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు ఆర్డీవో కిడారి సందీప్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఆయా గ్రామ, వార్డు సచివాలయల్లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి రూరల్ పరిధిలో 3 సెంట్లు,అర్బన్ పరిధిలో 2 సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

మసీద్‌లో నమాజ్ చేస్తూ అనంతలోకాలకు


మృతి చెందిన ఖాజాహుసేన్

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లోని మసీద్‌లో ఓ మత పెద్ద నమాజ్ చేస్తూ ప్రాణాలు వదిలాడు. ఇందుకు సంబంధించిన వివరాలు.. మంగళవారం రాత్రి గ్రామంలోని మర్కస్ మసీద్‌లో గ్రామ మత పెద్ద, తబ్లీగ్ జమాత్ అమీర్ సాహెబ్ అయిన ఎల్ఎస్ ఖాజాహుసేన్ (70) నమాజ్ కెళ్లాడు. ప్రార్థన చేస్తుండగా ఉన్నట్టుండి కుప్పకూలిపోయారు.సహచరు లు గమనించి పరిశీలించగా అప్పటికే ప్రాణాలు వదిలినట్లు గుర్తించారు. విషయం తెలియగానే కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు తరలివచ్చి బుధవారం ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతుడికి భార్య ఆశాబీ, ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానంగా ఉన్నారు.

అందరికి అందుబాటులో యూరియా

గడివేముల: మార్క్‌ఫెడ్ ద్వారా మండలంలో అందరికి ఎరువులు అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తున్నట్లు ఏఓ పవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతకాలంగా యూరియా అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం గుర్తించి యూరియా విడుదల చేసిందన్నారు. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు నైతిక విలువలు అలవరుచుకోవాలి


మాట్లాడుతున్న మహమ్మద్ మియా

పాణ్యం: విద్యార్థులు నైతిక విలువలను అలవరుచుకోవాలని గజల్ గాయకులు మహమ్మద్ మియా సూచించారు. బుధవారం నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల స్థాయి నుంచే సామాజిక విలువలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, హెచ్ఓడీ శేషయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన నారాయణ

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట సమీపంలోని ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడినట్లు హైవే పోలీసులు తెలిపారు. నెల్లూరు జిల్లా బొమ్మవరానికి చెందిన నారాయణ కర్ణాటక నుంచి స్కూటీపై నెల్లూరుకు బయలుదేరాడు. ఘటనా స్థలం వద్ద ప్రమాదశాత్తు కింద పడటంతో కాలికి తీవ్ర గాయమైంది. దీంతో అతడిని 108లో నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న హైవే పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు.

6న ఏఐబీఈ మోడల్ టెస్ట్

కర్నూలు: కర్నూలు బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఈ నెల 6న భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) ఏఐబీఈ 20వ మోడల్ టెస్టుకు ఏర్పాట్లు చేసినట్లు భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రంగనాథ్, జిల్లా అధ్యక్షులు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, కోశాధికారి దస్తగిరి, సహాయ కార్యదర్శి షఫీలు బుధవారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో తెలిపారు. లా పూర్తి చేసుకుని ప్రాక్టీసు రావడానికి ఏఐబీఈ పరీక్ష పాసైన తర్వాత ప్రాక్టీస్ కోసం మోడల్ టెస్టు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈనెల 6వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు పరీక్ష ఉంటుందని, వివరాలకు 98854 71917, 93938 22654, 99083 77745 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పడకేసిన పారిశుధ్యం

పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. ఫలితంగా గ్రామాల్లో రోగాలు విజృంభిస్తున్నాయి. జ్వరపీడితులతో ఆస్పత్రుల్లో నిండిపోతున్నాయి. అయినా పంచాయతీ అధికారులకు పారిశుధ్య చర్యలు చేపట్టాలనే ధ్యాసే లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పరిసరాలను శుభ్రం చేయించడం, దోమలు నివారణకు ఫాగింగ్ చేయించడం తదితర పారిశుధ్య చర్యలకు పంచాయతీ సిబ్బంది తిలోదకాలిచ్చారు.

– గడివేముల


గడివేముల జీసీ కాలనీలో రోడ్డుపైనే ఉన్న మురుగునీరు

- దోమల బెడదతో అల్లాడుతున్న ప్రజలు
- నివారణ చర్యలు చేపట్టని పంచాయతీ అధికారులు
- రోగాల బారిన ప్రజలు

గడివేముల మండల కేంద్రంలో దాదాపు 20 వేల జనాభా ఉంది. వివిధ వేలం పాటల ద్వారా, ఇంటి, కుళాయి పన్నుల రూపంలో ఏటా లక్షలాది రూపాయల ఆదాయం వస్తోంది. అయినా కనీస వసతులు కల్పించడంలో మాత్రం పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఏ వీధి చూసినా అపరిశుభ్రతతో కంపు కొడుతున్నాయి. రోడ్లపైనే మురుగు నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

రోడ్లపైనే మురుగు నీరు

రోడ్లపైకి మురికి నీరు వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కాలువలైతే నెలలైనా శుభ్రతకు నోచుకోవడంలేదు. మురికి నీటి కాలువలు, చెత్త కుప్పలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య కార్మికులు గ్రామంలోని ప్రధాన రహదారుల్లో మురుగునీరు అధికంగా ఉండటంతో నడవటానికి సైతం ఇబ్బందులు పడుతున్నారు.

రోగాల బారిన ప్రజలు

ఖాళీ స్థలాలు, ఇళ్ల మధ్య మురుగు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అటువంటి ప్రదేశాల్లో దోమల మందు పిచికారీ చేయడం, నీటి నిల్వలను తొలగించడం తదితర చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. ప్రస్తుత సీజనల్ వ్యాధులకు తోడు.. దోమకాటుతో కొత్త రోగాలు ప్రబలుతున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రవేటు ఆస్పత్రుల్లో చిన్నారులతో, జ్వరపీడితులతో నిండిపోయారు. ఫాగింగ్ మిషన్లు ఉన్నా వాటిని వినియోగించడం లేదనే విమర్శలున్నాయి.


గడివేముల-1 సచివాలయం వద్ద ఫాగింగ్ మిషన్ (ఫైల్)

యాస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధికి చర్యలు

కర్నూలు(సెంట్రల్): యాస్పిరేషనల్ బ్లాక్‌లలో కొత్త ఆలోచనలతో మరింత అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం యాస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధిపై నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో యాస్పిరేషనల్ బ్లాక్‌లుగా ఎంపికైన మద్దికెర, చిప్పగిరి, హొళగుంద మండలాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులను నీతి ఆయోగ్ సీఈఓకు వివరించారు. విద్యా, పోషక, జీవనోపాధులు, ఆరోగ్యం, వ్యవసాయం ఇతరాత్రా అభివృద్ధి కార్యక్రమాలను వినూత్న రీతిలో రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు మనోహర్, నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ భాస్కర్, డీఆర్‌డీఏ పీడీ వెంకట రమణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ విజయ పాల్గొన్నారు.

డీఐజీతో భేటీ

కర్నూలు: ఉమ్మడి జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.చౌడేశ్వరి బుధవారం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్‌ను, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యావపూర్వకంగా కలిశారు. గత నెల 8న 14 మంది నాన్ క్యాడర్ ఎస్పీలకు ఐపీఎస్ హోదా లభించింది. ఇందులో చౌడేశ్వరి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె పోలీసు ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

యూరియా పంపిణీ చేయాలి


ఆర్ఎస్‌కే వద్ద నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

పాణ్యం: మండల పరిధిలోని భూపనపాడు, అలమేరు మద్దూరు, నెరవాడ, కొండజూటూరు, బలపనూరు గ్రామాల్లో రైతులకు యూరియా దొరక్క అవస్థలు పడుతున్నారని, రైతు సేవా కేంద్రాల ద్వారా సక్రమంగా పంపిణీ చేయాలని కోరుతూ రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆర్ఎస్‌కే కేంద్రం వద్ద బుధవారం రైతులతో కలిసి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా బస్తా రూ.266లు ఉండగా ప్రైవేట్ వ్యక్తులు రూ.400 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారన్నారు. అధికార పార్టీ నాయకులు కృత్రిమ కొరత సృష్టించి చిన్న సన్నకారు రైతులకు యూరియా అందకుండా చేస్తున్నారన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని బ్లాక్‌లో ఉన్న యూరియాను గుర్తించి రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేయాలన్నారు. అనంతరం వ్యవసాయ అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, ఐఎఫ్‌టీయూ మండల కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ ఎల్‌పీఎంల పరిష్కారంలో జాప్యం చేయొద్దు


సి.బెళగల్లో రెవెన్యూ అధికారుల తీరుపై మండిపడుతున్న జేసీ నవ్య

సి.బెళగల్: భూ సర్వే తర్వాత ఏర్పడ్డా జాయింట్ ఎల్‌పీఎంలను ఎందుకు విడగొట్టడం లేదని జాయింట్ కలెక్టర్ నవ్య మండల అధికారులు, సిబ్బందిపై మండిపడ్డారు. బుధవారం కర్నూలు ఆర్డీఓ సందీప్‌తో కలిసి మండల కేంద్రం సి.బెళగల్‌కు చేరుకున్న జేసీ అక్కడ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి ఎరువుల నిల్వలు, అమ్మకాల వివరాలను మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలో వ్యవసాయ సిబ్బంది చేపట్టిన ఈ పంట నమోదును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్తి పంటసాగు, ప్రస్తుత పరిస్థితిపై వ్యవసాయ సిబ్బంది, రైతులతో మాట్లాడారు. సి.బెళగల్ మూడవ రేషన్ షాప్‌ను తనిఖీ చేసి ప్రజలకు అందుతున్న సరుకులు, నాణ్యతపై లబ్ధిదారులతో మాట్లాడారు. అలాగే కిసాన్ మాల్‌లో ఎరువుల నిల్వలను, రికార్డులను జేసీ తనిఖీ చేసి, రైతుల ఆధార్‌కార్డులు లేకుండ ఎరువుల అమ్మకాలు జరగడాన్ని గుర్తించి యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. భూ సమస్యలపై ప్రత్యేకంగా నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో రైతుల నుంచి 145 అర్జీలు రాగా, అందులో 63 అర్జీలు పేర్లు, వివరాల మార్పు మాత్రమే ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో అలసత్వం ఎందుకు వహిస్తున్నారని ప్రశ్నించారు. పోలకల్ రెవెన్యూ గ్రామంలో అత్యధికంగా జాయింట్ ఎల్‌పీఎంలను ఎందుకు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలోగా ఈ సమస్య పరిష్కరించి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ వెంకటలక్ష్మిని జేసీ ఆదేశించారు. ఇంటి స్థలాలు, ఇళ్ల నిర్మాణాలు తదితర అంశాలపై జేసీ అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాణెమ్మ, డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం, మండల సర్వేయర్ నాగభూషణం, డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, ఆర్ఐ తరుణ్, ఎస్ఐ పరమేష్ నాయక్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ‘చంద్ర’గ్రహణం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

- ఈనెల 9న అన్నదాతలతో ఆందోళనలు, నిరసనలు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

కర్నూలు (టౌన్): రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ‘చంద్ర’గ్రహణం పట్టిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి విమర్శించారు. రైతుల గురించి ఏనాడైనా చంద్రబాబు ప్రభుత్వం ఆలోచించిందా అని ప్రశ్నించారు. కల్లూరులోని తన స్వగృహంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. ఏడాదిన్నరలోపే కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. రైతులను టీడీపీ అధినేత చంద్రబాబు మోసం చేశారని ఆరోపించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు కేంద్రంతో కలుసుకొని రూ. 26 వేలు ఇస్తామని మొదటి సంవత్సరం ఎగ్గొటారన్నారు. ఇప్పుడు కేవలం రూ. 5 వేలు ఇచ్చారన్నారు. ఇది మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు

యూరియా కోసం రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోందని కాటసాని అన్నారు. రెండు నెలలైనా సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకపోవడం దారుణమన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఉల్లి రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రైతులకు ఇప్పటి వరకు నష్టపరిహారం అందలేదన్నారు. తెలుగుదేశం నేతలే ఉద్దేశపూర్వకంగా యూరియాను బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పొగాకు, మామిడి, మిర్చి, టమాటా, ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర అందలేదన్నారు. రైతుల గోడు వినకుండా మద్యం, ఇసుక, మైనింగ్‌లలో టీడీపీ నేతలు బీజీగా ఉన్నారన్నారు.

9న ఆర్డీవో కార్యాలయాల వద్ద నిరసన

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల రైతులు ఎలాంటి ఇబ్బందులు పడలేదని కాటసాని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందాయన్నారు. ధరల స్థిరీకరణ పేరుతో జగనన్న రూ. 3 వేల కోట్లు నిధి కేటాయించారని, ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏడాది రైతులను ఆదుకున్నారన్నారు. రైతులను మోసం చేసిన చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీసే రోజులు వచ్చాయన్నారు. ఈనెల 9న జిల్లాలోని అన్ని ఆర్డీఓ కార్యాలయాల వద్ద అన్నదాతలతో కలసి నిరసన తెలపుతామన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేస్తున్నట్లు చెప్పారు. పెద్ద సంఖ్యలో రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. సమావేశంలో నగర పాలక డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్ నారాయణ రెడ్డి, శివారెడ్డి, పాటిల్ హనుమంతరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతు బజార్ ప్రారంభమెప్పుడో?

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని కల్లూరు అర్బన్ 32వ వార్డు గోవర్ధన్ నగర్‌లో నిర్మించిన రైతు బాజర్‌ను ప్రారంభించడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదని సీఐటీయూ నాయకులు సుధాకరప్ప, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్‌బాషా, ఐద్వా నాయకురాలు లక్ష్మీబాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం డీవైఎఫ్ఐ, ఐద్వా, సీఐటీయూ ఆధ్వర్యంలో రైతు బజార్ ఎదుట ఆందోళన చేపట్టారు. రైతు బజార్ ప్రారంభమైతే ముజఫర్‌నగర్, మాదిరాజ్ నగర్, సుందరయ్య నగర్, గంగావతి, గోవర్ధన్, ఫరూక్, అయ్యస్వామి, ఉమామహేశ్వరి, చింతలముని, కన్యాక పరమేశ్వరి నగర్‌లతో పాటు ఇండస్ట్రియల్ ఎస్టేట్, పందిపాడు, ఇందిరమ్మ కాలనీ, లక్ష్మీపురం, బస్తిపాడు, బొల్లవరం, పుసులూరు తదితర గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతు బజార్‌ను ప్రారంభించాలని, లేదంటే ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

10,411 క్వింటాళ్ల ఉల్లి కొనుగోలు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వం ఉల్లి క్వింటాలుకు ప్రకటించిన రూ.1200 మద్దతు ధర లభించాలంటే పొలంలోనే గ్రేడింగ్ చేసుకొని నాణ్యతతో మార్కెట్‌కు తీసుకురావాలని మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి సూచించారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు అమ్మకానికి వచ్చిన ఉల్లి దిగుబడులకు వ్యాపారులు టెండర్ ద్వారా రేటు కోట్ చేస్తారని, రూ.1200 కంటే ఎక్కువ ధర వచ్చిన లాట్లను వ్యాపారులే తీసుకుంటారని చెప్పారు. అంతకంటే తక్కువ ధర లభించిన లాట్లను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుందని వివరించారు. బుధవారం 5,489 క్వింటాళ్ల ఉల్లి కొనుగోళ్లతో కలుపుకుని, ఇప్పటివరకు 10,411 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. మార్కెట్ యార్డుకు ఉల్లి తెచ్చే రైతులు విధిగా ఈ–క్రాప్ బుకింగ్ ధ్రువ పత్రాలు, ఆధార్ కార్డు, పొలం పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా నకళ్లు తీసుకురావాలని పేర్కొన్నారు.

రేషన్ షాపుల్లో ఉల్లి విక్రయం

కర్నూలు(సెంట్రల్): నగరంలోని రేషన్ షాపుల్లో గురువారం నుంచి ఉల్లిని అందుబాటులో ఉంచినట్లు డీఎస్ఓ ఎం.రాజారఘువీర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కిలో రూ.14 ప్రకారం ఉల్లిని కార్డుదారులు పొందవచ్చన్నారు.

ఎమ్మెల్యే జయరాం క్షమాపణ చెప్పాలి

కర్నూలు(సెంట్రల్): రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డికి ఫోన్ చేసి బెదిరించిన గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సీపీఎం, రైతు సంఘం జిల్లా కార్యదర్శులు డి.గౌస్‌దేశాయ్, జి.రామకృష్ణ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతపల్లిలో సోలార్ పేరుతో బలవంతపు భూసేకరణ చేస్తున్న కంపెనీకి వ్యతిరేకంగా, రైతులకు అండగా నిలుస్తున్న ప్రభాకరరెడ్డిని ఎమ్మెల్యే ఫోన్ చేసి బెదిరించడం సరైన పద్ధతి కాదని, చేతనైతే రైతులకు మేలు చేయాలని, లేకపోతే ఊరుకోవాలన్నారు. అంతేతప్పా రైతుల కోసం పోరాటం చేస్తున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిపై ఇష్టానుసారంగా మాట్లాడడం తగదని, ఆయన బెదిరిస్తే బెదిరే రకం కాదని, ఇలాంటి ఎమ్మెల్యేలను కమ్యూనిస్టులు ఎంతో మందిని చూశారన్నారు. కవ్వింపు చర్యలు మానుకోవాలని లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

విధులను బాధ్యతగా నిర్వర్తించాలి

కోడుమూరు రూరల్: అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి ఆదేశించారు. బుధవారం కోడుమూరు మండల పరిషత్ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఈఓ కార్యాలయానికి సంబంధించిన రికార్డులను పరిశీలించడంతో పాటు, కార్యాలయ నిర్వహణ, సిబ్బంది పనితీరుపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ పరిపాలన అధికారి రామ్ గోపాల్, ఎంపీడీఓ రాముడు, ఏఈ గంగరాజు, సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ మంజుల, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరులో :

అనంతరం జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి గూడూరు మండల పరిషత్ కార్యాలయాన్ని కూడా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో సీఈఓ సమావేశమై ఈ–ఆఫీస్ నిర్వహణతో పాటు, 15వ ఆర్థిక సంఘం నిధుల నిర్వహణపై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశ్వినికుమార్, డిప్యూటీ ఎంపీడీఓ మధులత, పరిపాలన అధికారి ఆయూబ్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.


కోడుమూరు ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(రూరల్): జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి బుధవారం మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. వివిధ రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ జి. రఘునాథ్ మండలం లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సర్వసభ్య సమావేశాల్లో చేసిన తీర్మానాల తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఏఓ గోపాల్, మండల పంచాయతీరాజ్ ఇంజినీర్ టి.ముక్తార్‌బాషా, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక పూజల్లో కాటసాని


పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి బుధవారం వినాయక పూజల్లో పాల్గొన్నారు. కల్లూరు అర్బన్ 31వ వార్డులో నిర్వహించిన వినాయక పూజల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మిద్దె చిట్టెమ్మ, తిరుపాల్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుపై వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోండి


నిల్వవున్న నీటిని చూపుతున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని కేతవరం గ్రామం కొత్త కాలనీలో వర్షపునీరు, మురుగునీరు రోడ్డుపై నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని మహిళా సంఘం నాయకురాలు నాగమ్మ డిమాండ్ చేశారు. బుధవారం కాలనీలో నీరు నిల్వవున్న ప్రాంతాలను కాలనీ మహిళలతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నాగమ్మ మాట్లాడుతూ, కొత్త బిల్డింగ్‌లలో సీసీ రోడ్లను హెచ్చు, తగ్గులుగా నిర్మించడంతో వర్షపునీరు, మురుగు నీరు ప్రధాన రోడ్లపై నిల్వ ఉండడంతో అటుగా రాకపోకలు చేయలేక మహిళలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు, స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దోమల బెడదతో అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగాలకు గురవుతున్నారన్నారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని పంచాయతీ అధికారులు మురుగునీటి తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు లింగమ్మ, అరుణ, జయంతి పాల్గొన్నారు.

బడికెళ్లాలంటే బురద దాటాల్సిందే


వర్షాలకు అధ్వానంగా తయారైన కోడుమూరు మోడల్ స్కూల్ దారి,


బురదమయంగా ఉన్న దారిలో బడికెళుతున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

కోడుమూరు రూరల్: మండలకేంద్రం కోడుమూరులో మోడల్ స్కూల్‌కు వెళ్లాలంటే విద్యార్థినీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఊరికి దూరంగా పొలాల మధ్యలో నిర్మించిన ఈ స్కూల్‌కు కిలోమీటర మేర మట్టి రోడ్డు ఉంది. ఎన్నో ఏళ్లుగా మట్టి రోడ్డు స్థానంలో సిమెంట్ రోడ్డు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ మట్టి రోడ్డంతా వాన నీటి నిల్వలతో గుంతలమయంగా మారి ఎక్కడికక్కడ బురద పేరుకుపోయింది. దీంతో కిలోమీటర మేర ఈ అధ్వానపు దారిలో పాఠశాలలకు చేరుకునేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.


ముందుకు కదలని సైకిల్

పీజీ సెట్ కౌన్సెలింగ్ ప్రారంభించాలి

కర్నూలు కల్చరల్: పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ వర్సిటీలకు లబ్ధి చేకూర్చడానికే పీజీ ప్రవేశాలను ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ వర్సిటీ నాయకులు అలీ, భూపాల్, కమల్, శ్రీనాథ్, రాఘవేంద్ర, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విష్ణు సహస్ర నామ పారాయణం


ప్రత్యేక అలంకరణలో గోదాదేవి

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో నిర్వహిస్తున్న శ్రీ విష్ణు సహస్ర నామ అఖండ పారాయణం బుధవారం ముగిసింది. గత 60 రోజులుగా నిర్వహిస్తున్న ఈ అఖండ పారాయణం బుధవారం సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలు, పూజలతో ముగిసింది. గోదా అమ్మవారికి తులసి, మల్లెపూలతో అర్చన నిర్వహించారు. హోమాలు, తీర్థ ప్రసాద కార్యక్రమాలు జరిగాయి. గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పర్లెల్ల నాగరాజు, సభ్యులు బాల సుధాకర్, పాలాది సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.